క్లుప్తంగా

చర్చి ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



యద్దనపూడిలో శంకుస్థాపన చేస్తున్న పాస్టర్, గ్రామస్తులు

యద్దనపూడి: మండల కేంద్రం యద్దనపూడిలోని ఎపిఫానియా క్రీస్తు లూథరన్ చర్చి ప్రహరీ, వేదిక నిర్మాణం కోసం పాస్టర్ రెవరెండ్ రిచర్డ్స్ పచ్చ ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. మొత్తం రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రహరీ, వేదిక నిర్మాణానికి దాతల కవలా చినరాఘవులు, నల్లమద్ది రామారావు రూ.1 లక్ష విరాళం ఇవ్వగా మిగతా నగదును గ్రామస్తులు, సంఘస్తులు సమకూర్చుకొని నిర్మాణం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ పెద్దలు గొట్టిముక్కల బిజయ్య, క్రాంతికుమార్, లూకయ్య, లూథర్, రామారావు, చినరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మెరిట్ విద్యార్థులకు పురస్కారాలందించిన రోటరీ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నాలుగు మండల్లాలోని 13 పాఠశాలల విద్యార్థులకు పర్చూరు రోటరీ క్లబ్ వారు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. సోమవారం స్థానిక రోటరీ భవనం నందు జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పురస్కారాలతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, మంచినీటి సీసాలు, రాత సామగ్రి అందజేశారు. భవిష్యత్‌లో విద్యార్థులు మంచి విజయాలను సాధించి సమాజాభివృద్ధికి తోడ్పడాలని ముఖ్య అతిథి రోటరీ జిల్లా బేసిక్ ఎడ్యుకేషన్ అక్షరాస్యత చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు రిటైర్డ్ సెంట్రల్ ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ బిరుదు రవీంద్రనాథ్, క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, తోకల కృష్ణమోహన్, కోట శ్రీనివాసరావు, పాతోలు వెంకన్న, దండా శ్రీనివాసరావు, కారుమూడి సుబ్బారెడ్డి, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, మున్నంగి వెంకట సుబ్బయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు సరిచేయరూ.. !



వేలాడుతున్న కరెంటు తీగలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని చెరుకూరు గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమీపంలో విద్యుత్ సంభాలు ఒరిగిపోయినా అధికారులు స్పందించడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు నివాస గృహాలుపై పడి ఊహించని ప్రమాదాలు జరుగుతాయోమోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను సరిచేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుందని విద్యుత్ సిబ్బంది పనితీరును విమర్శిస్తున్నారు. గతంలో ప్రధాన ఎల్టీ వైరు తెగిపోయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలు కాలిపోయాయని వారు గుర్తు చేసుకొని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు తిరిగి జరగకుండా అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలను సరిచేయడంతో పాటు తీగలను సరిచేసి ప్రమాదాలు జరిగేందుకు ఉన్న అవకాశాలను తొలగించాలని వారు కోరుతున్నారు.

కౌంటింగ్ రోజున ఉత్సవాల నిషిద్ధం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

చినగంజాం: ఎన్నికల కౌంటింగ్ రోజు ఆటు తరువాత అనుమతులు లేని ఉత్సవాలు నిషిద్ధమని ఎస్ఐ ఎం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదగంజాం, కోడూరి వారిపాలెం, కాటం వారిపాలెం గ్రామాలలో సోమవారం ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌంటింగ్‌ను పురస్కరించుకొని గ్రామాల్లో పెట్రోలు అమ్మకాలు, బాణసంచాలు పేలుళ్లు, ర్యాలీలు నిర్వహించడం వంటివి చర్యలు నిషిద్ధమని ఆయన తెలియజేశారు. పోలీసుల హెచ్చరికలను లక్ష్య పెట్టకుండా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన ప్రజలకు హెచ్చరించారు. గ్రామాల్లో అల్లర్లు జరగకుండా ఉండేందుకు ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న అభయం.. మహిళలకు ఈబీసీ నేస్తం



ఎస్ఎల్ గుడిపాడులో ఈబీసీ నేస్తం దరఖాస్తు మహిళతో ఫొటో అప్‌లోడ్ చేయిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ (ఫైల్)

- ఈబీసీ నేస్తంతో అగ్రవర్ణ పేదలకు చేయూత
- మూడో విడత మండలంలో 4042 మంది అర్హులు
- వారి ఖాతాల్లో రూ. 6.06 కోట్లు జమ
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

బల్లికురవ: పేదలు, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకోవడమే కాకుండా అగ్రవర్ణాల్లో ఉన్న పేదలను కూడా ఆదుకున్న ఏకైక సీఎం జగన్ మోహన్ రెడ్డి. ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన విధంగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసి చేతల ప్రభుత్వంగా నిరూపించుకుంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. సమాజంలోని ప్రతి ఒక్కరికి చేయూతనిచ్చి ఆర్థికంగా బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భావించారు. ఇందుకోసం గ్రామాల్లోని అగ్రవర్ణాలలోని 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన మహిళలు అర్హులుగా గుర్తించారు. సచివాలయాల వారీగా వలంటీర్లు అర్హత కలిగిన మహిళల చేత ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో వెల్ఫేర్ అసిస్టెంట్లతో దరఖాస్తు చేయించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఈ మూడేళ్లలో ప్రతి ఏడాది రూ. 15 వేల చొప్పున సొమ్ము జమ చేశారు. గత ప్రభుత్వాలు తమ గోడు పట్టించుకోలేదని జగనన్న చేయూతనివ్వటం ఎంతో ఆనందంగా ఉందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పించి దరఖాస్తులు..

ఈబీసీ నేస్తం పథకానికి సంబంధించి మండలంలోని 20 సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్‌లు అవగాహన కల్పించారు. మూడు సంవత్సరాల్లో ప్రతి ఏడాది దరఖాస్తు చేసుకున్న వారు 2021-22లో 1347 మంది, 2022-23లో 1348 మంది, 2023-24లో 1347 మందికి ఈ పథకం కింద రూ. 6.06 కోట్లు వారి ఖాతాల్లో జమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు రూ.630 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఈ ఏడాది మార్చి 4న నంద్యాల జిల్లా బనగానపల్లెలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకానికి లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ము జమ చేసేందుకు బటన్ నొక్కారు. ఎన్నికల కోడ్‌తో డీబీటీ నిధులు ఆగిపోయాయి. ఎన్నికల తదుపరి ఈసీ ఆదేశాలతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ అయింది. అగ్రవర్ణాలోని బ్రాహ్మణ, ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ కులాలకు ఇచ్చిన మాట ప్రకారం సొమ్ము తమ ఖాతాలకు జమచేసి మాటతప్పని ముఖ్యమంత్రిగా జగనన్న చరిత్రలో నిలిచారని వారు కొనియాడారు.

మోకాలొడ్డిన చంద్రబాబు..

ఈఐదేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి చూడలేక తెలుగుదేశం పార్టీ జీర్ణించుకోలేకపోయింది. మొదటి నుంచి ఎన్నికల పోలింగ్ వరకు రోజూ బురదజల్లే ప్రయత్నం చేస్తూ వచ్చింది. ఎన్నికల కోడ్ రాకముందే ప్రకటించిన పలు పథకాలను లబ్ధిదారులకు అందించే ప్రక్రియలో టీడీపీ నాయకుడు చంద్రబాబు కుట్రలకు తెరతీశారు. లబ్ధిదారుల ఖాతాల్లో జమవకుండా ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయించి తన కపటబుద్ధిని చూపించుకున్నారు. దీంతో నిధులు ఆగిపోయాయి. ఈకసితోనే లబ్ధిదారులు మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని చూడాలన్నా ప్రేమతో ఓట్లు వేశారని సమాచారం.



బల్లికురవలో ఈబీసీ దరఖాస్తు మహిళతో ఫొటో అప్‌లోడ్ చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్ (ఫైల్)

ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదు..



మాది ఆర్యవైశ్య కులం. గతంలో ఏ ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక అగ్రవర్ణ పేదలను గుర్తించి ఈబీసీ నేస్తంలో మూడు సంవత్సరాలుగా చేయూతనిచ్చారు. వలంటీర్ ఇంటికి వచ్చి చెప్పి సచివాలయానికి తీసుకువెళ్లి దరఖాస్తు చేయించాడు. సంతోషంగా ఉంది.

– సాదు రోజా, కొప్పరపాడు

మాటతప్పని సీఎం జగనన్న..



ప్రజా సంకల్పయాత్రతో రాష్ట్రంలోని ప్రజల కష్టాలు తెలుసుకుని 2019 ఎన్నికల్లో మేనిఫెస్టో ప్రకటించిన హామీలన్నీ నెరవేర్చి మాట తప్పని సీయంగా జగనన్న నిలిచారన్నారు. జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి అయితే పథకాల ద్వారా తమలాంటి అగ్రవర్ణాల పేదలకు సాయం అందుతుంది.

– మల్లవరపు సత్యవతి, ఎస్ఎల్ గుడిపాడు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు..



అర్హతఉన్న ప్రతి ఒక్కరికి వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాం. ఈబీసీ నేస్తానికి సంబంధించి ఎన్నికలకు కోడ్‌తో ఏడాది సొమ్ము లబ్ధి దార్ల ఖాతాలకు జమకావటంలో కొంత ఆలస్యమైంది. ఈ వారంలో అందరికీ సొమ్ము జమ అయింది. లబ్ధిదారులు ఖాతాలను పరిశీలించుకోవచ్చు.

– హనుమారెడ్డి, ఎంపీడీవో

రేపు మండల సమావేశం

యద్దనపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పులగం రజనీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివసుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున్న వివిధ అంశాల మీద ఎన్నికల కోడ్‌కు లోబడి సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు.

ఆరోగ్య స్థితిగతులను నమోదు చేయాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో నివశిస్తున్న ప్రజలతో పాటుగా ఐదేళ్లపు చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను విధిగా రికార్డుల్లో నమోదు చేయడంతో పాటుగా టీకాలను సక్రమంగా అందించాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. సోమవారం ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యస్థితిగతులు, శిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, 5 ఏళ్లలోపు చిన్నారులకు అందించాల్సిన రోగాల నిర్మూలన టీకాలు, రోగనిరోధకశక్తి పెంచే ఇంజక్షన్లను క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. ప్రతి చిన్నారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పలకరించి చిన్నారుల ఆరోగ్యస్థితి గతులను విధిగా రికార్డుల్లో నమోదు చేసి నివేదికలు అందించాలన్నారు. ఏఒక్క చిన్నారి కూడా అనారోగ్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాల గణాంకాలను వారం రోజుల్లో అందించాలని సూచించారు. సమావేశంలో సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు

- 16 రౌండ్లకు, 14 టేబుళ్ల ఏర్పాటు
- ఈసీ నిబంధనలు పాటించాలి
- విలేకరుల సమావేశంలో చీరాల ఆర్వో సూర్యనారాయణరెడ్డి



చీరాల ఆర్వో సూర్యనారాయణరెడ్డి

చీరాల టౌన్: మరో వారం రోజుల్లో జరగనున్న ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేశామని చీరాల నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్వో వివరాలను వెల్లడించారు. సార్వత్రిక పోరుకు సంబంధించి ఓట్లు లెక్కింపును జూన్ 4న బాపట్ల జిల్లా కేంద్రంలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని సీ బ్లాకులో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓట్లు లెక్కింపునకు అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేశామని ఆర్వో తెలిపారు. చీరాల ఎన్నికల ఫలితం లెక్కింపునకు 16 రౌండ్లులో ఫలితం తేలుతుందని, కౌంటింగ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్నీ ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు, సర్వీస్ ఓట్లు లెక్కింపునకు మరో నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో అభ్యర్థి 14 మందిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవచ్చన్నారు. జూన్ 4 జరిగే కౌంటింగ్‌కు పోటీ చేసిన అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం ఆరు గంటలకల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రతి ఏజెంట్‌కు ప్రత్యేకంగా కౌంటింగ్ పాస్ అందిస్తామని, ఓట్లు లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు నిషేధించామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, ఈసీ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో చీరాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 202711 మంది ఉన్నారు. వీటిలో పురుషులు 98,729 మంది, స్త్రీలు 103958 మంది, థర్డ్ జెండర్ 24 మంది ఉన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో ఉన్న 202711 మంది ఓటర్లలో 167466 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారని ఆర్వో తెలిపారు. ఎన్నికల్లో పోలింగ్ 82.61 శాతంగా నమోదైంది. ఈఎన్నికలలో 82.61 పోలింగ్ శాతం నమోదు కాగా పురుషుల కంటే స్త్రీలు 3909 మంది అధికంగా ఓట్లు హక్కు వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు జరిగే కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ర్యాలీలు, బాణాసంచాలు కాల్చడం నిషేధమన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. ఈసీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు.

తిరునాళ్లకు సిద్ధమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రం

- భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రం
- రేపటి నుంచి 20వ వార్షిక తిరునాళ్లకు సర్వం సిద్ధం



అలకంరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి (ఫైల్)



కృష్ణంరాజువారిపాలెంలో తిరునాళ్లకు సిద్ధం చేసిన దేవస్థానం

మేదరమెట్ల: కోరిన కోర్కెలు తీర్చే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రం తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. మండలంలోని పమిడిపాడు గ్రామ పంచాయతీ పరిధి కృష్ణంరాజువారిపాలెం (రెడ్డిపాలెం)లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి క్షేత్రం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. గత 49 ఏళ్లుగా విశేషపూజలు అందుకుంటూ ప్రత్యేకంగా నిలుస్తుంది ఈపుణ్యక్షేత్రం. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకురాలు నాగరాజస్వామి ఆలయాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ప్రతి మంగళ, ఆదివారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు, అభిషకాలు నిర్వహిస్తుంటారు. భక్తులు అందచేసిన సొమ్ముతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆలయంతో పాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అభయాంజనేయస్వామి, నాగేశ్వరస్వామి ఆలయం, తమిళనాడులో ఆరు పుణ్యక్షేత్రాల్లో ఉన్న విధంగా 46 అడుగుల ఏకశిల ద్వారా సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఏర్పాటు చేశారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

ప్రతి మంగళ, ఆదివారాలలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నాగులచవితి, నాగపంచమి, సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి వంటి ప్రత్యేక సందర్భాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈవార్షిక వేడుకలు గత 20 సంవత్సరాల నుంచి నిరంతరంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 29వ తేదీ నుంచి 30 వరకు ప్రత్యేక పూజలు, 31వ తేదీన స్వామివార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం అన్నదాన వితరణ, సాయంత్రం 4.30కు రథోత్సవం, రాత్రి 8.30కు స్వామివారికి ఉయ్యాలసేవ ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణ వేడుకల్లో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

రుచి, శుచితో కూడిన వంటలు మాత్రమే చేయాలి



కుకింగ్ హెల్పర్ల శిక్షణ తరగతుల్లో ఎంఈఓలు, మాస్టర్ ట్రైనర్

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించే ఆహారంలో మంచి రుచి, శుచితో కూడిన వంటలు మాత్రమే చేయాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రం కారంచేడు విద్యావనరుల కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వంట సహాయకులకు అవగాహన కార్యక్రమం, శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతుల్లో కుకింగ్ హెల్పర్లకు అవసరమైన శిక్షణనిస్తామన్నారు. వీరి ద్వారా ప్రతి విద్యార్థికి మంచి పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మాస్టర్ ట్రైనర్‌గా కట్టా సుకన్య వ్యవహరించారు. శిక్షణా తరగతుల అనంతరం హెల్పర్లకు వంటల పోటీలు నిర్వహించారు. వీటిలో మంచి రుచికరంగా, శుభ్రంగా వండి వడ్డించిన వారికి బహుమతులు కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వర్ణ కాంప్లెక్స్ సీఆర్పీ కమలాకర్, అన్ని గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల కుకింగ్ హెల్పర్లు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం

వేటపాలెం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు తమ పంట భూముల్లో నవధాన్యాలు వేసుకోవడం వలన భూమి సారవంతం అవుతుందని మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితిలో ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమన్నారు. పచ్చిరొట్ట ఎరువులతో పాటు పీఎండీఎస్ కిట్‌లో నవధాన్యాలు రైతులతో వేయించాలని తెలిపారు. పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంతో పాటు అధిక దిగుబడులు సాధించుకోవచ్చన్నారు. ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం మోహన్‌రావు ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మణచారి, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు ప్రమీల, వెంకటస్వామి, కవిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ కాశీవిశ్వనాథ్

దివ్యాంగులకు బాసటగా భవిత కేంద్రాలు



మేదరమెట్లలో ఇంటింటి సర్వేని పరిశీలిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ జ్యోత్స్న

అద్దంకి/మేదరమెట్ల: విభిన్న ప్రతిభావంతులకు బాసటగా భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త మట్ట జ్యోత్స్న అన్నారు. ఆమె సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం, వేలమూరిపాడు, పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీ, కొరిశపాడు మండలం మేదరమెట్ల చెంచుల కాలనీల్లో పర్యటించారు. 18 ఏళ్లలోపు దివ్యాంగులైన బాల బాలికలను గుర్తించే సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీలో సర్వే ద్వారా కొత్తగా దివ్యాంగులను గుర్తించామని చెప్పారు. సర్వే జరుగుతూనే ఉందని మండలంలోని వివిధ గ్రామాల్లో సర్వే చేస్తున్నారని చెప్పారు. బుద్ధిమాంద్యం, వినికిడి లోపం, పుట్టకతోనే పక్షవాతంతో బాధపడే పిల్లల గృహాలకు వెళ్లి పరిశీలించామన్నారు. ఇటువంటి పిల్లల అభివృద్ధికి భవిత కేంద్రాలు నిరంతరం శ్రమిస్తున్నాయని చెప్పారు. అక్కడ వారికి ప్రత్యేక శిక్షణద్వారా తెలివితేటలు పెంచడం, వివిధ పరికరాల ద్వారా విషయాన్ని తెలియజేయడం చేస్తారని చెప్పారు. ఫిజియోథెరపీతో వారిలోని వికలత్వ అవయవాలకు కొంత మేర చలనం కలగించేలా చేస్తారన్నారు. తద్వారా పిల్లలు తమ జీవితాన్ని తామే ఒకరిపై ఆధారపడకుండా చక్కదిద్దుకునే చేయడమే భవిత కేంద్రాల లక్ష్యమని చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వం వారి భవితకు కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఐఆర్‌టీలు వెంకటకొండయ్య, రవిశేఖర్ పాల్గొన్నారు.

అర్జీల విచారణ తప్పనిసరి

చీరాల టౌన్: ప్రజలు, విద్యార్థులతో పాటుగా వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను జాగ్రత్తగా విచారణ చేయాలని తహశీల్దార్ కె.నాసరయ్య సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. భూసమస్యలు, కుటుంబ ధ్రువీకరణ అర్జీల విచారణ నిష్పక్షపాతంగా చేయాలన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



చెన్నుపల్లిలో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: గర్భిణులకు నెలలవారిగా వేయాల్సిన వ్యాక్సిన్లను సకాలంలో వేస్తూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో నవజాత శిశువుకు, జన్మనిచ్చేలా తోడ్పాటునివ్వాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ అహమ్మద్ కోరారు. సోమవారం చెన్నుపల్లి సచివాలయంలో 104 ఉచిత వైద శిబిరంలో భాగంగా ఆయా వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. శిబిరంలో భాగంగా షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితం మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులు, చిన్నారుల ఇంటికి వెళ్లి పరీక్షలు చేశారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ప్రాథమిక వైద్యం ఎప్పటికప్పుడు వ్యాక్సిన్‌లు వేసేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. వైద్య సేవలను వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు. ఏఎన్ఎం అపర్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

చీరాల: చీరాల ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఉత్తర్వుల మేరకు సోమవారం చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తపాలెంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటిని సోదా చేశారు. ఇంటి ఆవరణలో పెట్రోలు, డిజిల్, కర్రలు, రాళ్లు ఉన్నాయా అని సోదాలు చేశారు. రౌడీషీటర్లకు వారి ఇంటి వద్దనే కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ ముందురోజు, కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలపైనా ఉందన్నారు. పోలీసుల ఉత్తర్వులు ఉల్లంఘిస్తే వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్లు తెరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.



సోదాలు నిర్వహిస్తున్న ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు

వరిగడ్డి వామి దగ్ధం



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బల్లికురవ: వరిగడ్డి వామిలో నుంచి పొగలతో మంటలు చెలరేగటంతో సర్వం అగ్నికి ఆహుతైంది. ఈఘటన సోమవారం మధ్యాహ్నం మండలంలోని వల్లాపల్లి గ్రామంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం గ్రామానికి దక్షిణం వైపు ఎస్సీ కాలనీకి చెందిన బొంతు చంద్రయ్య, సుమారు మూడెకరాలోని వరిగడ్డి కొనుగోలు చేసి గ్రామానికి చేర్చుకుని ఇటీవలే వామి వేసుకున్నాడు. పొలాల్లోని చెత్తచెదారానికి నిప్పు పెట్టటంతో వడగాల్పుల ఉధృతికి నిప్పురవ్వలు గ్రామంలోకి వచ్చి ఉంటాయని గ్రామస్తులు భావిస్తున్నారు. పరిసర గృహాలు వరిగడ్డి వాములకు మంటలు వ్యాప్తి చెందకుండా అగ్నిమాపక యంత్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ అధికారి ఆంజనేయులు సిబ్బందితో హుటాహుటిన గ్రామానికి వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 50 వేల విలువ చేసే వరిగడ్డి అగ్నికి ఆహుతై నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. ఫైర్ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ వేసవి ఎండలు వడగాల్పుల ఉధృతికి గ్రామంలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.